ప్రజాశక్తి

శుక్రవారం 13 జూన్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





ఖరీఫ్ సాగు ఆలస్యం !

- జలాశయాల్లో నీటి నిల్వలు అంతంతమాత్రం
- మొఖం చాటేసిన వర్షాలు
- పూర్తికాని కాల్వల మరమ్మతులు, నిర్వహణ పనులు



ప్రజాశక్తి - ఉమ్మడి కృష్ణాజిల్లా డెస్క్: కృష్ణా బేసిన్‌లోని జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా లేవు. దీనికితోడు సాగు నీటి కాల్వల మరమ్మతులు, నిర్వహణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదల ఆలస్యమవుతోంది. వర్షాలు కూడా ముఖం చాటేశాయి. ఈ నేపథ్యంలో కృష్ణాడెల్టాకు సాగునీటి విడుదలను అధికారులు వాయిదా వేశారు. వాస్తవంగా ముందస్తు ఖరీఫ్ సాగు నిమిత్తం జూన్ ఒకటో తేదీనాటికే సాగునీరు విడుదల చేయాల్సి ఉంది. గత ఏడాది సమయానికే నీటిని విడుదల చేశారు. ముందస్తుగా నాట్లు వేయడం ద్వారా తుపాను, వరదల ప్రభావం నుంచి పంటలు తట్టుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆలస్యంగా నాట్లు వేస్తే భారీ వర్షాలు, వరదలకు పంటలు ముంపునకు గురవుతాయి. ఇందుకు కాల్వలు, డ్రైనేజీలను ఆధునీకరించకపోవడం కూడా కారణంగా ఉంది. ఈ నేపథ్యంలో పంటలు ముంపునకు గురైతే మళ్లీ సాగు చేయాల్సి వస్తుండడంతో రైతులకు అదనపు ఖర్చు తప్పడం లేదు. ఇందుకుగా ముందస్తుగా నాట్లు వేస్తే... ఇవి కొంత మేర పెరిగి వరదలను తట్టుకుంటాయని అంచనా. అయితే ఇటీవల భారీ వర్షాలు కురిసినా ఆ తర్వాత వేసవి తీవ్రత పెరగడం, ఎగువ నుంచి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో ఈనెల 10వ తేదీన నీటిని విడుదల చేస్తామని అధికారికంగా ప్రకటించారు. అయితే మరోసారి నీటి విడుదల ఈనెల 15వ తేదీకి వాయిదా వేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలల్లో నీటి నిల్వలు తగ్గడంతో ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్‌పై అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. శ్రీశైలంలో గరిష్ట నీటి నిల్వ 215.08 టిఎంసిలు కాగా, గురువారం 56.69 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఇన్‌ఫ్లో 17,444 క్యూసెక్కులు వస్తున్నా, అవుట్ ఫ్లోను పూర్తిగా నిలిపివేశారు. అలాగే నాగార్జున సాగర్ జలాశయం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 312.05 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 135.95 టిఎంసిలు మాత్రమే ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇక్కడ ఇన్‌ఫ్లో 13,219 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 5,214 క్యూసెక్కులు మాత్రమే ఉంది. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 24.74 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. పులిచింతలకు ఇన్‌ఫ్లో లేదు. దీంతో ప్రకాశం బ్యారేజీకి కేవలం తాగునీటి అవసరాల నిమిత్తం రోజుకు 300 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. విజయవాడ ప్రకాశం బ్యారేజీ గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 3.07 టిఎంసిలు కాగా, ప్రస్తుతం పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో 1,994 క్యూసెక్కులు ఉండగా, మంచినీటి అవసరాల నిమిత్తం కాల్వలకు 1,994 క్యూసెక్కులు వదులుతున్నారు. వర్షాలు కురవడం ఇంకా ఆలస్యమైతే జలాశయాల్లో నీటి నిల్వలు మరింత తగ్గుతాయని అధికార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

కృష్ణా డెల్టాకు 15న సాగునీరు విడుదల

కృష్ణా డెల్టాలోని కాల్వలకు ఈనెల 10నే సాగునీరు విడుదల చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించారు. అయితే జలాశయాల్లో ఆశించిన మేర నీటి నిల్వలు లేకపోవడం, కాల్వల మరమ్మతులు, నిర్వహణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో వాయిదా వేశారు. ముందస్తు సాగుకే ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు చెబుతున్నా కాల్వల నిర్వహణ ఆలస్యం కావడం, ఎగువన ఉన్న ప్రాజెక్టుల్లో నీరు సరిగా లేకపోవడంతో నీటి విడుదల ఆలస్యమైంది. కష్ణా తూర్పు డెల్టాకు ఈనెల 15న సాగునీటిని విడుదల చేస్తామని జలవనరుల శాఖ కెసి డివిజన్ ఇఇ ఆర్.రవికిరణ్ తెలిపారు. ఎన్టీఆర్, కష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని కాల్వలకు విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేస్తారు.

మాటల్లోనే తక్షణ సాయం !

- ఇంకా బాధిత రైతులకు అందని నష్టపరిహారం
- హామీని నిలబెట్టుకోని సిఎం



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

గత నెలలో వచ్చిన ఈదురుగాలులు, అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోలేదు. బాధిత రైతుల ఖాతాల్లో సాయం జమ చేస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు పరిహారం జమ కాలేదు. దీంతో ప్రభుత్వ సాయం కోసం బాధిత రైతులకు ఎదురుచూపులు చూడడం తప్పడం లేదు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం మానికొండకు చెందిన కొల్లి వెంకట కృష్ణారావు 1.85 ఎకరాల్లో, బాపులపాడు మండలం సింగన్నగూడెం గ్రామానికి చెందిన సముద్రాల వరప్రసాద్ 1.45 ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. గెలలు వస్తున్న దశలో వీచిన ఈదురుగాలులకు తోటలు నేలవాలాయి. ఈ ఇద్దరు రైతులు ఎకరానికి లక్ష రూపాయలకుపైగా నష్టపోయారు. ప్రభుత్వం తక్షణ సాయం అందిస్తామని ప్రకటించడంతో ఒకింత ఊరట చెందారు. కానీ ఫలితం లేకుండా పోయింది. ఈదురుగాలులకు కృష్ణాజిల్లాలో (మిగతా 2లో)

కక్ష సాధింపు కోసమే తప్పుడు కేసులు

వైసిపి కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని



ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని, ప్రభుత్వం చేస్తున్న తప్పులను నిలదీసే వారిని అక్రమ కేసులతో భయపెట్టి అరెస్టులు చేస్తోందని వైసిపి కృష్ణాజిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) అన్నారు. మచిలీపట్నం ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆ పార్టీ కార్యకర్తలనుద్దేశించి పేర్ని నాని మాట్లాడారు. గత ఏడాది జూన్ 4న కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆ నెల 12వ తేదీ వరకు చంద్రబాబు ప్రభుత్వం బాధ్యతలు తీసుకోకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. 4 – 12 తేదీల మధ్య వైసిపి కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులపై ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఈ దాష్టీకం అంతా గవర్నర్, ఎన్నికల కమిషన్ ఖాతాలోకి వేసేందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రయత్నించారని అన్నారు. ఈ (మిగతా 2లో)

నిధుల విడుదలలో తీవ్ర జాప్యం

- నిలిచిన మరమ్మతులు
- పాఠశాలలు ప్రారంభమైనా అందుబాటులోకి రాని వసతి గృహాలు
- అడకత్తెరలో పోక చెక్కలా అధికారుల పరిస్థితి



ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : "పాఠశాలలు పున:ప్రారంభమయ్యే నాటికి వసతి గహాల్లో చేపట్టిన మరమ్మతులు పూర్తి చేయాలి, లేకుంటే చర్యలు తప్పవు" అంటూ కొంతమంది అధికార పార్టీ శాసన సభ్యులు సంబంధిత అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే ఇప్పటికే పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతే పనులు ఎలా పూర్తిచేస్తామని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఇద్దరికీ సమాధానం చెప్పలేక అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క మాదిరి తయారైంది. కష్ణాజిల్లాలోని 108 సంక్షేమ వసతి గహాల్లో రెండు విడతలుగా కనీస మరమ్మతులు చేసేందుకు డిఎంఎఫ్‌టి నిధులు సుమారు రూ.8.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఉన్నతాధికారులు ప్రకటించారు. వసతి గృహాల మరమ్మతులకు సంబంధించి 2024 అక్టోబర్లో రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయల అభివద్ధి సంస్థ (ఎపిఈడబ్ల్యూఐడిసి) టెండర్లు పిలిచింది. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఈ నిధులతో ఆయా వసతి గహాల్లో తాగునీటి వసతి సమకూర్చాలి. మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ మరమ్మతులు చేయాలి. కిటికీలు, దోమల నియంత్రణ నిమిత్తం డోర్లకు మెస్‌లు, షట్టర్లు అమర్చాలి. ఫ్యాన్లు, బల్బులు తదితర ఎలక్ట్రికల్ వర్కులు, రంగులు వేయడం వంటి పనులు చేయాల్సి ఉంది. మొదటి దశలో చేసేందుకు 47 పనులను గుర్తించారు. అయితే వీటిలో అనుకున్న సమయానికి కనీసం 25 శాతం (మిగతా 2లో)



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి ఎస్.ఇలక్కియ

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

ప్రజాశక్తి - విజయవాడ : బాల కార్మికులను రక్షించటం, సంరక్షించటం, బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా గురువారం కార్మిక శాఖ, ఫోరంఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రాఫిట్ షూ కంపెనీ సంయుక్త సహకారంతో సమాజ సేవా కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ జి.ధనలక్ష్మి కార్మిక శాఖ అధికారులు ఎఎల్ఓఎస్ టి.రాజేష్, డి.రత్నకుమారి, పి.రామ్ కుమార్, జి.విజయ సారథి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆఫీసర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణపై శ్రద్ధ చూపాలి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : అన్న క్యాంటీన్ల నిర్వహణపై అధికారులు మరింత శ్రద్ధ చూపాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం గాంధీనగర్, ఈట్ స్ట్రీట్, ఏలూరు రోడ్ జంక్షన్, బిఆర్‌టిఎస్ రోడ్, ఎంజీ రోడ్ ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. ధర్నా చౌక్ లోగల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని ఎప్పటికప్పుడు రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వ్యర్థాల తొలగింపులో ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రపంచ రికార్డు టీమ్ ఎన్‌టిఆర్ కృషి ఫలితమే

- ●కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ
- ●14న కొండపల్లి ఖిల్లాపై యోగాంధ్ర

ప్రజాశక్తి - విజయవాడ : యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా కృష్ణా నదీ తీరంలో నిర్వహించిన వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా విజయవంతమై ప్రపంచ రికార్డు సాధించడం వెనుక టీమ్ ఎన్‌టీఆర్ ఉద్యోగుల కృషి ఉందని, ఇది జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. వాటర్ క్రాఫ్ట్ ఫ్లోటింగ్ యోగాలో ప్రపంచ రికార్డు సాధించిన సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో జిల్లా, నగర శాఖ కార్యవర్గ సభ్యులు గురువారం కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 21 నుంచి నెల రోజులపాటు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహించాలన్న ప్రభుత్వ సూచనల మేరకు నేటికి 23 రోజులుగా వివిధ వర్గాల ప్రజల్లో యోగాపట్ల అవగాహన కల్పించడంలో టీమ్ ఎన్‌టిఆర్ అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. కృష్ణా నదీతీరంలో వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగాను నిర్వహించాలన్న ఆలోచనను ఆచరణలో పెట్టి విజయవంతమై ప్రపంచ స్థాయి గుర్తింపు పొందడం తనకెంతో సంతోషాన్నించిందన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో చేపట్టనున్న ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేసి జిల్లా కీర్తిప్రతిష్టలు సాధించడంలో జిల్లా యంత్రాంగంతో ఉద్యోగులు అడుగులు కలపాలన్నారు. ఈ నెల14న పర్యాటక కేంద్రమైన కొండపల్లి ఖిల్లాలో ప్రత్యేకంగా ఉద్యోగులతో మెగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జీఏడీ-పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఎన్‌జిజిఒ జిల్లా అధ్యక్షులు డి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ యోగాంధ్ర విజయవంతంలో కలెక్టర్ లక్ష్మీశ అహర్నిశలు కృషిచేయడంతోపాటు ప్రతిరోజూ ఉదయాన్నే ఒక గంట సమయాన్ని కేటాయిస్తూ ప్రజలతో కలిసి మమేకమై యోగాసనాలను ఆచరిస్తున్న తీరు ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. కలెక్టర్ క్రమంతప్పకుండా ప్రతిరోజూ యోగాసనాలు వేయడాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగులు తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో కొంత సమయాన్ని యోగాసనాలకు కేటాయిస్తున్నారని తెలిపారు. యోగాసనాలు ఆచరించడం వల్ల నూతనోత్సాహంతో మరింత సేవలు అందించే అవకాశం తమకు కల్పించినందుకు ఉద్యోగులందరి పక్షాన కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్‌ను అభినందించిన వారిలో జిల్లా సహాధ్యక్షులు వేమూరి ప్రసాద్, కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు బీవీ రమణ, ఎం.రాజుబాబు, రామకృష్ణ, శివలీల, నగర శాఖ అధ్యక్షులు సీవీఆర్ ప్రసాద్, కార్యదర్శి నజీరుద్దీన్, నగర కార్యవర్గ సభ్యులు బి.రాజశేఖర్, ఎం.మధూసూధనరావు, ఖాసిం సాహెబ్, సాగర్ ఉన్నారు.



కలెక్టర్ లక్ష్మీశను సత్కరిస్తున్న ఎపిఎన్‌జిఒ సంఘ నాయకులు

ఔషధాన్ని మించినది యోగా : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రాణాలను నిలబెట్టే వైద్యుణ్ని భగవంతుడితో పోలుస్తూ వైద్యో నారాయణో హరి అంటారని, అయితే అనారోగ్యాన్ని దూరం చేసేందుకు వైద్యులిచ్చే ఔషధాన్ని మించిన ఔషదం యోగాసనాలదని, యోగాచరణ ద్వారా రోగాలు దరిచేరకుండా చూసుకోవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాంధ్ర 23వ రోజు కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్స్ థీమ్ యోగా జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, వైద్య ప్రముఖులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డాక్టర్ ఉషారాణి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షులు డా.హనుమయ్య, ఫాగ్సీ ప్రతినిధి డాక్టర్ త్రిపుర, రమేష్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పి.రమేష్, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ వి.రాణి, ఆయుష్ అధికారి డాక్టర్ రామత్లేహి, డాక్టర్ జె.సుమన్, డాక్టర్ రత్నప్రియదర్శిని, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యనిపుణులు డాక్టర్ సింగరి ప్రభాకర్, డాక్టర్ కోడె ప్రభాదేవి, ఆయుష్ ఆస్పిటల్ వైద్యులు డాక్టర్ రమేష్, అనిల్ న్యూరో వైద్యులు డాక్టర్ అనిల్, అమెరికాన్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, హదలాయ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాల్లో కలెక్టర్ లక్ష్మీశ, వైద్యులు

మొదటిపేజీ తరువాయి

నిధుల విడుదలలో తీవ్ర జాప్యం

పనులు కూడా పూర్తి చేయని పనులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు 30 పనులను రద్దు చేశారు. మిగిలిన 17 పనులకు మరొకటి కలిపి మొత్తం 18 వసతి గృహాల మరమ్మత్తుల పనులను కాంట్రాక్టర్లు పూర్తి చేశారు. రెండో దశలో 61 వసతి గృహాల మరమ్మత్తులను గుర్తించగా 59 పనులకు టెండర్లు పిలిచారు. వీటిలో 36 పనులు సాంఘిక సంక్షేమ, 24 పనులు బిసి సంక్షేమ, ఒకటి ఎస్‌టి వసతి గృహం పనులు ఉన్నాయి. మొత్తం 61 వసతి గృహాల మరమ్మతులకుగాను 47 పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు 31 పనులను మాత్రమే పూర్తిచేశారు. అయితే మొదటి రెండు దశల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించి కేవలం ఒకే ఒక్క బిల్లు రూ.5.94 లక్షలు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఈ బిల్లుల చెల్లింపుల గురించి పట్టించుకోలేదు. ఒక్కో కాంట్రాక్టర్ ఐదారు పనులకు టెండర్లు వేస్తున్నాడు. దీంతో ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వారు పనులు ముందుకు తీసుకు వెళ్ల లేకపోతున్నారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోతున్నాయి. ఇదిలా ఉండగా ఇటీవల కొంతమంది ప్రజాప్రతినిధులు మరమ్మతులు జరుగుతున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనుకున్న స్థాయిలో పనులు జరగకపోవడంతో సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమయానికి పనులు పూర్తి చేయాలని, పాఠశాలల పున:ప్రారంభం నాటికి వసతి గృహాలను విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలని అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. ఇలా ఓవైపు ప్రజాప్రతినిధులు, మరోవైపు కాంట్రాక్టర్ల మధ్య అధికారులు నలిగిపోతున్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడి నిధులు విడుదలకు చర్యలు తీసుకోవాల్సిన అధికార పార్టీ ప్రజాప్రతినిదులు అవేమీ పట్టించుకాకుండా అధికారులపై చిందులు తొక్కడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకుని వసతి గృహాలను విద్యార్థులకు అందుబాటులో తీసుకు రావడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాటల్లోనే తక్షణ సాయం

135 మంది రైతులు నష్టపోయారు. ఎవరికీ ఇంత వరకు సాయం అందలేదు. పరిహారం కోసం ఎదురు చూస్తు కాలం వెళ్లదీస్తున్నారు.

అందాల్సిన సాయం రూ.1.09 కోట్లు

ఈదురుగాలులు, అకాల వర్షాలకు కృష్ణాజిల్లా బాపులపాడు, ఉంగుటూరు, ఉయ్యూరు, పమిడిముక్కల, పామర్రు, కంకిపాడు, పెనమలూరు తదితర మండలాల్లో 55.15 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు ఉద్యానశాఖ ప్రభుత్వానికి తుది నివేదిక కూడా అందించింది. అత్యధికంగా అరటి తోటలు 42.2 హెక్టార్లలో, కూరగాయలు 7 హెక్టార్లలో, తమలపాకు 5.5 హెక్టార్లలో, బొప్పాయి 0.4 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 135 మంది రైతులకు చెందిన అరటి, బొప్పాయి, తమలపాకు తదితర తోటలకు హెక్టారుకు రూ.35 వేల చొప్పున మొత్తం 55.1 హెక్టార్లకుగాను రూ.1.09 కోట్ల వరకు ప్రభుత్వం నష్టపరిహారంగా చెల్లించాల్సి ఉంది.

కక్ష సాధింపు కోసమే తప్పుడు కేసులు

క్రమంలోనే ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగడుతున్నారని, రోజూ మీడియాలో కనిపిస్తున్నారనే ఉద్దేశంతో కాకాని గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. ఎన్నికల లెక్కింపు, ఫలితాల రోజున బందర్లో బలరామునిపేట ఓ వ్యక్తి తలపగలగొట్టినట్లుగా కొడాలి నానిపై కేసు పెట్టారన్నారన్నారు. రేషన్ బియ్యం కేసు తన భార్యను కూడా ఇరికించే ప్రయత్నం చేశారన్నారు. ఆ సమయంలో తాను అనుభవించిన బాధ వర్ణనాతీతమన్నారు. తాజాగా నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశానంటూ కొత్త కేసును తెరపైకి తెస్తున్నారన్నారు. 2019 ఏప్రిల్ 8న వైసిపి అధినేత జగన్మోహనరెడ్డి మచిలీపట్నం వచ్చినప్పుడు పోర్టు నిర్మాణం చేపట్టాలని, 10 వేల మందికిపైగా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారని, ఆ మేరకు జగన్ ఎన్నికల హామీలు ఇచ్చారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 15,493 మందికి కరగ్రహారం ప్రాంతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. అక్రమ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో గన్నవరం మాజీ ఎంఎల్‌ఎ వంశీని అరెస్ట్ చేసినప్పుడు బందరులో పేర్ని నానిని ఎందుకు వదిలిపెడుతున్నారని తాజాగా ఓ పత్రికలో కథనం రాయడంతో మళ్లీ ఇళ్ల పట్టాల కేసుతో తన నోరు మూయించాలని కొల్లు రవీంద్ర, చంద్రబాబు చూస్తున్నారన్నారని విమర్శించారు. కేసులకు భయపడేది లేదని, ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్న తీరును ఎండగడుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
శుక్రవారం 13 జూన్ 2025

వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి-గన్నవరం : వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం మాదల వారి గూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి కూలీలు ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి కూలీలకు సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. మూడు నెలలుగా పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారి జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని చెప్పారు. అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి మూడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మరో నాయకులు తాతబ్బాయి మాట్లాడుతూ.. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఎప్పటికే కరెంటు భారాలు ప్రజలపై పడ్డాయన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయి జనాలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ఇంకా వెనుకబడిందని, పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామాల్లో నిరుపేద కూలీలు ఉపాధి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని వారికి నెలల వారీగా వేతనాలు చెల్లించాలన్నారు. 300 మంది ఉపాధి కూలీలు పాల్గొన్నారు. అదేవిధంగా సూరంపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన జరిపారు. 400 మంది ఉపాధి కూలీలు ఇందులో పాల్గొన్నారు.

చౌటపల్లిలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్



సమావేశంలో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

ప్రజాశక్తి - గుడివాడ : ఉద్యాన పంటలైన కొన్నిరకాల కూరగాయలతో లభాలు వస్తాయని ఉద్యానవన శాస్త్రవేత డా॥ మంజువాణి తెలిపారు. గురువారం పంటల కృషి విజ్ఞాన కేంద్రం ఘంటశాల ఆధ్వర్యంలో గుడివాడ రూరల్ మండలం చౌటపల్లి గ్రామంలో వికసిత్ కషి సంకల్పన ఆభియాన్ కార్యక్రమాన్ని నిర్వాహించారు. ఈ కార్యక్రమానికి కేవికే ఉద్యాన వన శాస్త్రవేత్త డా॥ మంజువాణి, వ్యవసాయాధికారిణి బి.అనంతలక్ష్మీలు మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షలు, విత్తన లభ్యత, నేల ఆరోగ్యానికి అనుసరించి పోషక యాజమాన్యం కొత్త వంగడాలు, వ్యవసాయంలో యాంత్రీకరణ తదితర వాటి వల్ల వచ్చే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డా॥ కళ్యాణ్‌బాబు, శ్రీనివాస్, జ్యోతిరమణీ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - గుడివాడ : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ గుడివాడ పట్నంలోని నిజాంపేటలో సిపిఎం ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు అమీర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



గుడివాడ రూరల్‌లో అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణం, గుడివాడ రూరల్‌లో అన్ని అంగన్‌వాడీ, సచివాలయాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ అధికారిణి ఎ విజయఫ్లారెన్స్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఎసిడిపివో ఎం పద్మావతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు బికెడి భవాని, నాగజ్యోతి, ఎడి నజీరున్నీసా, ఎ జయంతి, పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, 15వ వార్డు ఇన్‌ఛార్జి వేసుపోగు ఇమ్మానియేలు, ఎంఎస్‌కెలు ఎస్‌కె షకీనాబేగం, హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి పద్మావతి, ఎఎల్ తులసమ్మ, బి రామలక్ష్మి, జ్యోతి, సుభాషిణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :**కూచిపూడి గ్రామపంచాయతీ పరిధిలో గల నాలుగు అంగన్వాడి కేంద్రాలు సంయుక్తంగా నాలుగవ నెంబర్ కేంద్రంలో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆరుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కూచిపూడి సెక్టార్ సూపర్వైజర్ ఏ ఎస్ కళ్యాణి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, ఎన్ఎం ఆఫ్ కూచిపూడి ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కూనపరెడ్డి లక్ష్మీకళ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఆట పాటలతో కూడిన అంగన్వాడి విద్య పిల్లల జీవిత భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మన అంగన్వాడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. 21మంది పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చెయించి పలకలు, బలపాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వ జర్ ఎల్ దుర్గ దేవి అద్యక్షతన సభలో ఎంపీడీవో ఇ సత్య కుమార్, ఇఓపిఆర్ డి, ధిలీఫ్ కుమార్, ఉంగుటూరు సర్పంచ్ కాటూరి వరప్రసాద్, అంగ న్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- నందివాడ:** మండలంలోని నందివాడ సెక్టారు మహిళా సమాఖ్య కార్యాలయంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డేవిడ్ రత్నరాజు, ఈవోపీఆర్డి ఎమ్. అమీర్బాషా, ఏఓ కోటేశ్వరరావు, డీటీ ఎన్.కిషోర్ పాల్గొన్నారు . **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని ప్రతి అంగన్వాడి కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యా స కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈవూరి. వాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 3 సంవత్సరాలు నిండిన బాల, బాలికలను అంగన్వాడి కేంద్రాల్లో చేర్చుకొని వారికి అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎం ఎస్ కె, అంగన్వాడి కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** విద్యార్థుల భవిష్యత్తు అంగన్వాడీ కేంద్రాలలో నిక్షిప్తంబడి ఉంటుందని చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణ కుమార్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని చోరగుడి, కష్ణాపురం గ్రామాలలో సామూహిక అక్షరాభ్యాసం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కష్ణాపురం గ్రామ సర్పంచ్ వీరంకి బలు సులమ్మ, సూపర్‌వైజర్ సలీమ్‌మున్నీసా, అంగన్‌వాడీలు పూర్ణిమ, పరమేశ్వరి, ఆనందకుమారి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కంకిపాడు ఎంపీటీవో పి అనూష ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మూడు సంవత్సరాలు నిండిన 25 మంది పిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఏవో బసవయ్య, జిల్లా అంగన్వాడి డ్వాక్రా ప్రధాన కార్యదర్శి అన్నవరపు శివ పార్వతి, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ నీరజ, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్ అన్నమని పాల్గొన్నారు.

అలాగే పెనమలూరు మండలం పెద్దపులిపాకలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసిడియస్ సూపర్వైజర్ కళ్యాణమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు డివి లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉయ్యూరు, మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గండిగుంటలో జరిగిన కార్యక్రమంలో ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజినీ పలు అంగన్వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** విద్యార్థులకు తొలిబడి అంగన్వాడీ బడి అని ఎండిఓ టి. స్వర్ణలత అన్నారు. గురువారం గన్నవరం అంగన్వాడి కేంద్రంలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మంగమ్మ, ఎంఈఓ 1 ఎమ్ ఈ ఓ 2 వైస్ ఎంపీపీ ఎంపీటీసీలు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



నందివాడ మండలంలో...



పమిడిముక్కల మండలంలో..



ఉయ్యూరులో...

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రజాశక్తి- నందివాడ : ట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలం లోని జనార్ధనపురం టెలిఫోన్‌నగర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రావూరి బిక్షం(69) తన గ్రామం అరిపిరాల నుండి పది గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై గుడివాడ వెళ్తుండగా టెలిఫోన్ నగర్ ఆర్టీవో ట్రాక్స్ వద్ద ప్రోక్లైన్ ట్రాలీ వాహనం వెనక్కి రివర్స్ చేస్తుండగా రావూరి బిక్షం కి తగిలి తీవ్ర గాయం కావడంతో వైద్యం నిమిత్తం గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బిక్షం మృతిచెందారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు.

వాహనదారులకు జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనాలు నడిపే చోదకులపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని 2వ, 4వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 34 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఆరవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 34 మందిలో 09 మందికి ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున రూ.1,35,000, మిగిలిన 25 మందికి ఒక్కొక్కరికిరూ.10,000 చొప్పున రూ.2,50,000 మొత్తం 34 మందికి రూ.3,85,000 జరిమానా విధించారు.

రేపటి నుంచి విద్యార్థులకు రాయితీ బస్సు పాసులు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : పాఠశాలలు కళాశాలలు పున ప్రారంభమైనందున పాఠశాలకు కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఉచిత బస్ పాసులు రాయితీపాసలు ఈనెల 14వ తేదీ నుండి ఇవ్వనున్నట్లు అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. ఉచిత బస్పాసులు 20 కిలోమీటర్ల దూరం వరకు బాలురకు 12 సంవత్సరాల లోపు వరకు, అలాగే బాలికలకు 10వ తరగతి వరకు గాని ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఉచిత పాసుల కొరకు విద్యార్థులు తమ పాఠశాల నుండి స్టడీ సర్టిఫికెట్ తీసుకొని దానితోపాటు ఆధార్ కార్డు కాపీ జతచేసి అవనిగడ్డ బస్ స్టేషన్ లో గల బస్సు పాస్ కౌంటర్ నందు అందజేసి పాసు పొందవచ్చునని తెలిపారు. ఈ ఉచితపాసులు 2026 ఏప్రిల్ వరకు ఉపయోగ పడతాయన్నారు. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులు స్టూడెంట్ బస్సు పాసులను ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని దాని ప్రింట్ అవుట్ తీసుకొని హెచ్ఎం ప్రిన్సిపాల్ తో సంతకం చేయించుకొని బస్సు పాస్ కౌంటర్లో అందజేసి బస్సు పాస్ పొందాలన్నారు.



18 వసతి గృహాలు అభివృద్ధి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ ట్రస్ట్ నిధులు రూ రెండు కోట్ల 64 లక్షల 98 వే ల తో 18 వసతి గృహాలు అభివృద్ధి చేసినట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. గురువారం అవనిగడ్డలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఏపీ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి సి పర్యవేక్షణలో 18 ఎస్సీ బీసీ బాలుర బాలికల వసతి గహాలుచ ఆశ్రమ పాఠశాలలకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయించి రంగులు వేయించినట్లు తెలిపార.ు వసతి గహాల మరుగుదొడ్లకు వాటర్ సౌకర్యం కల్పించి వంట గదులన్నీ ఆధునికరించినట్లు తెలిపారు. అవసరమైనచోట్ల భోజనం చేసేందుకు చదువుకు నేందుకు అణువుగా అదనపు గదులు నిర్మిస్తున్నట్లు బుద్ధప్రసాద్ చెప్పారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

ప్రజాశక్తి-వీరులపాడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ కోరారు. సిపిఎం మండలం కమిటీ సమావేశం జుజ్జూరులో వట్టికొండ పార్థసారధి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా డి.వి.కృష్ణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ ఎన్నికల హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిరంతరం పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ప్రజలపై భారాలు ఆపాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలన్నారు. మండలంలో కూడలి-దాములూరు మధ్య ఉన్న హై లెవెల్ బ్రిడ్జికి అప్రోచ్ రోడ్లు నిర్మించాలని, వీర్లపాడులో ఉన్న ఎస్సీ హాస్టల్‌కు ప్రహరీ గోడ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్, మండల కార్యదర్శి చాట్ల రవి, మండల కమిటీ సభ్యులు బాబు, లాల్ అహ్మద్, చాంద్ బేగం, సుందర్రావు కోడూరు పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం


ప్రజాశక్తి-మైలవరం: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ నుండి అంగన్వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు మైలవరంలోని 243 అంగన్వాడీ కేంద్రాలలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారిని కె.పుష్పలత మాట్లాడుతూ 20 మంది పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అన్నమ్మ,



టీచర్లు బి లలిత బాయి, ఎస్కే మున్ని, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నందిగామ మండలం, పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలలో గురువారం సిడిపిఓ జయలక్ష్మి భార్గవి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో జరిగిన కార్యక్రమాలలో సూపర్వైజర్లు కరుణ వెంకట రావమ్మ తారాబి పాల్గొన్నారు. **కంచికచర్ల:** కంచికచర్ల ప్రాజెక్టు పెండ్యాల సెక్టర్ పరిధిలో గ్రామాల్లో సిడిపిఓ లక్ష్మి భార్గవి ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఆధ్వర్యంలో అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా గురువారం మున్నలూరు అంగన్వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 3ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కరీమా పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చిల్లకల్లు ప్రాజెక్టు గ్రేడ్ 1 సూపర్వైజర్ రజనీజ్వాల ఆధ్వర్యంలో 12, 14 వార్డులలోని పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించి, ప్రీస్కూల్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రజని జ్వాల మాట్లాడారు.

శాప్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వేడుకలను గురువారం




ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి సర్కార్‌కు క్రీడా పరికరాలతో వినూత్నంగా శుభాకాంక్షలు తెలియజేశారు. క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్ క్రీడల పరికరాలతో అక్షరాల రూపంలో థ్యాంక్యూ సీబీఎన్ వన్ ఇయర్ అంటూ సరికొత్తగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆనందోత్సాహాలతో బాణాసంచా కాల్చడంతోపాటు 12 నెలలు పూర్తయిన సందర్భంగా 12 కేజీల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, టీఎస్ఓ ఎస్వీ రమణ, ఎస్ఓలు కోటేశ్వరరావు, మహేష్, సురేంద్ర పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ప్రపంచ మాదక ద్రవ్య దినం ఈ నెల 26న పురస్కరించుకుని డి అడిక్షన్ సెంటర్ విజయవాడ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, వాసవ్య మహిళా మండలి మెంటల్ హెల్త్ ప్రాజెక్ట్ సంయుక్తంగా మాదకద్రవ్యాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ డి స్వరాజ్య లక్ష్మి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులను డి ఎడిక్షన్ సెంటర్‌లో చేర్పించాలన్నారు. గ్రూప్ థెరపీలు, సైకాలజిస్ట్ కౌన్సిలింగ్‌లు డి అడిక్షన్ సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-తిరువూరు: ఈ నెల 15 తర్వాత మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేయనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో తిరువూరు నగర పంచాయతీ కార్మికులు గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంజనీరింగ్ కార్మికులు, నాన్ పిహెచ్ సి కార్మి కులు చేయనున్న సమ్మె డిమాండ్లను పరిష్కరించాలని, అప్పటి వరకు తాము విధులకు హాజరు కామని నినాదాలు చేశారు. ముందుగా



ఇబ్రహీంపట్నంలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ నెంబర్ 36 ప్రకారం రూ.24,500 జీతాలు చెల్లించాలని, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి వెంకటేశ్వర్లు, కార్మికులు వాసు, కందుల శ్రీను, రవి, నారా యణ, మస్తాన్, కలాం, మోహన్‌రావు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని కోరుతూ ఈ నెల 15 తర్వాత ఎప్పుడైనా నిరవధిక సమ్మెలో పాల్గొంటామని తెలియజేస్తూ కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తనకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జిఓ నెంబర్ 11 ఆధారంగా కేటగిరీలు నిర్ణయించాలన్నారు. జిఓ ఎంఎస్



తిరువూరులో బైక్ ర్యాలీ

నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలన్నారు. 2018లో నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రాతపూర్వక ఒప్పందంలో సమాన పనికి సమాన వేతనం 2019 జనవరి నుండి అమలు చేస్తామన్న ఒప్పందాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి యం మహేష్, కొండపల్లి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మేస్త్రి వాసు, కరెంటు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం గృహాలను పేదలకు కేటాయించాలి : సిపిఎం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : అర్హులైన నిరుపేదల కోసం కోట్లాది రూపాయలతో నిర్మించిన పక్కా గృహాలు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డాగా మారాయని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు విమర్శించారు. గురువారం సిపిఎం పశ్చిమ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నగర శివారు ప్రాంతమైన జక్కంపూడి గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కొండ కాలువ గట్ల ప్రాంతాలలో నివసిస్తున్న పేదల ఇళ్లను తొలగించి జక్కంపూడిలో ఇళ్ల కేటాయించారన్నారు. అయితే జక్కంపూడి గ్రామంలో వైయస్సార్ కాలనీ పేరిట నిర్మించిన భవన సముదాయాలలో సుమారు రెండు వేల పక్కా గహాలు లబ్ధిదారులకు ఇంతవరకు కేటాయించలేదని ధ్వజమెత్తారు. నగర శివారు ప్రాంతం కావడంతో జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ ఇల్లు గంజాయి బ్లేడ్ బ్యాచ్ వంటి అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయని మండిపడ్డారు. వందల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన గృహాలను పేదల కేటాయించడంపై అలసత్వం ఎందుకని పాలకులను ప్రశ్నించారు. కూటమి నేతల అవినీతి పంపకాలు ఓ కొలిక్కి రానందునే పేదలకు పక్కా గహాలను మంజూరు చేయటం లేదన్న అనుమానం తలెత్తుతుందని సందేహం వ్యక్తం చేశారు.



ఇళ్లను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి దశాబ్దం కాలం కావస్తుందని గుర్తు చేశారు. ఇప్పటికే దశారులు రంగ ప్రవేశం చేసి పక్కాగృహాల ఇప్పిస్తామంటూ సుమారు మూడు నుంచి ఐదు లక్షల వరకు దండుకుంటున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే కౌన్సిల్ సమావేశంలో జక్కంపూడిలోని జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ కేటాయింపుపై పాలక, ప్రతి పక్షాన్ని ప్రశ్నోత్తరాల సమయంలో నిలదీయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి సరైన రీతులో స్పందన రానిపక్షంలో అర్హులైన లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాలు చేయిస్తామంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వజీర్, శంకర్, రవి, స్వామి పాల్గొన్నారు.

విజయవాడలో రాపిడో విస్తరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ రైడ్‌హైలింగ్ ప్లాట్‌ఫారమ్ అయిన రాపిడో, ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను విస్తరించనున్నట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత విస్తరించడంలో భాగంగా 14 కొత్త నగరాల్లో బైక్ టాక్సీ, ఆటో సేవలను ప్రారంభించిందన్నారు. ఒంగోలు, విజయనగరం, ఏలూరు, మదనపల్లె, మచిలీపట్నం, చిత్తూరు, శ్రీకాకుళం, భీమవరం, గుడివాడ, నరసరావుపేట, నంద్యాల, తెనాలి, తాడేపల్లిగూడెం, తాడిపత్రి నగరాల్లో ఈ వ్యూహాత్మక విస్తరణతో, రాపిడో ఇప్పుడు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో యాప్ ఆధారిత మొబిలిటీ సేవలను అందిస్తున్నది. అని తెలిపారు కీలకమైన మైలురాయి ద్వారా, రాపిడో సౌకర్యవంతమైన, సరసమైన ధరలతో, అందుబాటులో ఉంటుందని అన్నారు. వినియోగదారుల ఆదరణ పొందుతున్న ప్రముఖ ప్లాట్‌ఫారమ్‌గా తన స్థానాన్ని మరింత బలపరిచిందని అన్నారు. ఇది దేశవ్యాప్తంగా 500 నగరాల్లో సేవలు విస్తరించాలని రాపిడో లక్ష్యంగా పని చేస్తున్నదని అన్నారు.

శామ్‌సంగ్ భాగస్వామ్యంతో 'వి' వాణిజ్య సేవలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ప్రముఖ టెలికాం ఆపరేటర్ వోడాఫోన్ ఐడియా (వి) 5జి వాణిజ్య సేవలు ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ కె.తరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కీలక టెలికాం మార్కెట్లలో ఒకటైన, సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా అని పిలువబడే ఐటి హబ్, బెంగళూరు ప్రాంతంలో శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కో, లిమిటెడ్ (శామ్‌సంగ్)తో భాగస్వామ్యం ద్వారా వాణిజ్యపరమైన 5జి సేవలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు . 2024 నుండి, కంపెనీలు న్యూ జనరేషన్, 5జి నెట్‌వర్క్‌ను అమలు చేయడానికి ప్రణాళిక రూపొందించిందని అన్నారు. ప్రధాన టెలికాం సర్కిల్‌లలో శామ్‌సంగ్ పరిశ్రమ ప్రముఖ పరిష్కారాలతో వి యొక్క లెగసీ 2జి, 4జి నెట్‌వర్క్‌లను ఆధునీకరించడానికి కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి నాగపవన్‌కుమార్

ప్రజాశక్తి- ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నానికి చెందిన యువ న్యాయవాది వల్లభనేని నాగపవన్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం కర్నూలు జిల్లా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు షర్మిల నాయకత్వంలో పని చేస్తానన్నారు.

వైద్యులకు 'రూట్స్' పురస్కారాలు అభినందనీయం

ఏపి ఎన్‌జిజిఒ అధ్యక్షులు ఎ.విద్యాసాగర్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రూట్స్ హెల్త్ ఫౌండేషన్ వైద్యులకు అవార్డులు అందజేయడం అభినందనీయమని ఏపీ ఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేయనున్న 12వ వార్షిక అవార్డులకు సంబంధించిన బ్రోచర్, క్యూఆర్ కోడ్‌లను గురువారం గాంధీనగర్‌లోని ఎన్‌జీవో హోమ్‌లో విద్యాసాగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ వైద్యులను సత్కరించుకోవడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న కేన్సర్ మహమ్మారి నుంచి రక్షణ పొందేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి చైతన్యవంతులను చేయడం ముదావహమన్నారు. ప్రముఖ వైద్యులు, ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డా. రమణమూర్తి మాట్లాడుతూ వైద్య వృత్తిలో విశిష్ట సేవలందిస్తున్న వైద్యులను గుర్తించి వారికి అవార్డులు ప్రదానం చేస్తున్న రూట్స్ హెల్త్ ఫౌండేషన్ పలువురికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు డా. జి.సమరం మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం తొలిసారిగా హెల్త్ ఫౌండేషన్ ప్రకటించిన అవార్డుల్లో తొలి అవార్డు స్వీకరించడం ఎప్పటికీ మరచిపోలేనన్నారు. అవార్డు ఎవరు పొందినా ఆ గౌరవం ప్రతి వైద్యునికీ దక్కినట్లేనని భావిస్తున్నన్నారు. ఫౌండేషన్ ఛైర్మన్ డా. పోలవరపు విజయభాస్కర్ మాట్లాడుతూ రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య వత్తిలో సేవలందిస్తున్న సీనియర్ వైద్యునికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు, సామాజిక సేవ చేస్తున్న ఒకరికి రూట్స్ హెల్త్ సర్వీస్ అవార్డు, బెస్ట్ ఆయుర్వేదిక్ ఫిజీషియన్ అవార్డు, బెస్ట్ నేచురోపతిక్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న విద్యాసాగర్

ఫిజీషియన్ అవార్డు, బెస్ట్ హెల్త్ సర్వీస్ అవార్డు (సామాజిక సేవ) ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నామని, క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ నెల 23వ తేదీలోగా రిజిస్టర్ చేసుకోవాలని ఆయన కోరారు. వచ్చే నెల 6న సిద్ధార్థ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా. ఏవై రావు, డా. వీఎస్ఎన్ రావు, డా. పద్మజ, ఫౌండేషన్ సభ్యులు కె.పూర్ణిమ, ఎంఎస్ఆర్‌పి శర్మ, పి.జయకామేశ్వరి, సీహెచ్ విజయలక్ష్మి, కె.యలమంద, మణి పోలవరపు, డా. కె.శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు భరోసా 'శ్రీ బాలసాయి'

- కళాశాల కరస్పాండెంట్ కుందేటి విజయ్‌కుమార్



బందరులోని శ్రీ బాల సాయి డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

ఒకప్పుడు డిగ్రీ చదివితే ఉద్యోగం వస్తుందో రాదో అన్న పరిస్థితుల నుంచి నేడు మచిలీపట్నంలోని శ్రీ బాల సాయి డిగ్రీ కాలేజీలో చేరిన విద్యార్థులు తమ కోర్సు కంప్లీట్ అయ్యేలోపు మినిమం రెండు కంపెనీల నుంచి ఆఫర్ లెటర్లు, మరో చేత్తో డిగ్రీ పట్టాతో బయటకు వస్తున్నారని ఆ కళాశాల కరస్పాండెంట్ కుందేటి విజయకుమార్ పేర్కొన్నారు. శ్రీ బాలసాయి డిగ్రీ కళాశాల గురించి కె.విజయ్‌కుమార్ చెప్పిన వివరాలిలా ఉన్నాయి.

మచిలీపట్నంలోని ఏ బజారులో చూసినా బాల సాయి డిగ్రీ కాలేజీల్లో చదివి మంచి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డ యువకులు కనపడతారు. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్స్‌తో 40 సంవత్సరాల అద్భుతమైన ఉద్యోగ భవిష్యత్తుని విద్యార్థులకు అందిస్తున్నాము. ఇందుకు మేము పాటిస్తున్న ఉత్తమ విద్యా ప్రమాణాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. గత పది సంవత్సరాలుగా మచిలీపట్నం చరిత్రలో సాఫ్ట్వేర్ ఉద్యోగాల సాధిస్తున్న ఏకైక సంస్థ మాదేనని నిరూపతమైంది. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు మా కాలేజీలో పూర్తి చేసిన వందలాది విద్యార్థులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు చేస్తూ వారి కుటుంబాలకు చేదోడు వాదోడుగా ఉంటుంటే వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీ చదువు కోసం మాకాలేజీని ఎంపిక చేసుకోవడమే మేము చేసుకున్న అదష్టంగా ఉద్యోగంలో సిరపడ్డ విద్యార్థులు తల్లిదండ్రులు స్పష్టంగా చెప్తున్నారు. 25 ఏళ్ల క్రితం వందమంది విద్యార్థులతో స్థాపించిన శ్రీ బాలసాయి డిగ్రీ కాలేజీ ఏఏటి కాయేడు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ, నేటికీ 1000కి పైగా విద్యార్థులు డిగ్రీ కోర్సులు చదువుతున్నారు. సుమారు 70 కంటే ఎక్కువమంది బోధనా సిబ్బంది సుమారు 55 కంటే ఎక్కువమంది నిర్వహణ సిబ్బందితో కళాశాల నడుపుతున్నారు. పట్టభద్రులైన విద్యార్థులకు సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాలు దొరకడంతో మా కాలేజీకి విశేషమైన ఆదరణ లభిస్తోంది. మచిలీపట్నంలో మూడేళ్ల డిగ్రీ పూర్తిచేసి ఇంజినీరింగ్ విద్యార్థులతో పోటాపోటీగా వారు తీసుకునే జీతాలకు సరి సమానమైన వేతనాలు తీసుకుంటూ సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించే ఏకైక సంస్థగా మా కళాశాల గుర్తింపు పొందింది. డిగ్రీ విద్యార్థులు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించడానికి అవసరమైన క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ విభాగాన్ని పదేళ్ల క్రితం మచిలీపట్నంలో ప్రవేశపెట్టిన ఘనత మా కళాశాలకే సొంతం. కమ్యూనికేషన్ స్కిల్స్, అనలిటికల్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ విద్యార్థులకు మెండుగా బోధించి ఇంటర్వ్యూలో నేరుగా ఎంపికయ్యేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాము. ఏ గ్రూపులో చేరినా 100 శాతం ఉత్తీర్ణత గ్యారంటీ, 100 శాతం జాబ్ గ్యారంటీతో కోర్సులను డిజైన్ చేసిన కళాశాలగా విద్యార్థుల్లో క్రేజ్ సంపాదించు న్నాము. బిసిఎ, బిఎస్‌సి, బికాం, బిబిఎ డిగ్రీలతో సాఫ్ట్వేర్ జాబ్స్, ఐటీ జాబ్స్, బ్యాంక్ జాబ్స్, నెట్వర్కింగ్ జాబ్స్, హార్డ్వేర్ జాబ్స్ ఇక్కడ విద్యార్థులు సాధించారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ పూర్తి కాకుండానే ఇన్ఫోసిస్, డెలాయిట్, క్యాప్ జెమినీ, టిసిఎస్ ఇంకా అనేక కంపెనీలలో మా విద్యార్థులు ఆఫర్ లెటర్ సొంతం చేసుకున్నారు. 2024లో డెలాయిట్ కంపెనీలో 34 మంది విద్యార్థులకు, జెన్ పాక్ట్ కంపెనీలో ఐదుగురు, టిసిఎస్ లో 45 మంది, సదర్లాండ్ కంపెనీలో 35 మంది, గ్లోబలాజిక్‌లో 31 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. 2023లో గ్లోబ లాజిక్‌లో 37 మంది, హెక్సవేర్ కంపెనీలో 14 మంది, విప్రో సంస్థలో 60 మంది, కాగ్నిజెంట్ కంపెనీలో ఐదుగురు, టిసిఎస్‌లో 12 మంది ఉద్యోగాలు సాధించారు. తాజాగా 2025లో డెలాయిట్ కంపెనీలో 18 మంది, టిసిఎస్‌లో 47మంది, ఇన్ఫోసిస్‌లో 49 మంది, డిజిటల్ మార్కెటింగ్ కంపెనీలో 48 మంది, విప్రోలో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో అత్యధిక ఉద్యోగాలు సాధించింది కేవలం బాలసాయి విద్యార్థులు మాత్రమే. విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకం పునాదిగా నూతన క్యాంపస్ పూర్తిస్థాయి కార్పొరేట్ మౌలిక సదుపాయాలతో ప్రారంభం కానుంది. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు తాము పనిచేస్తున్నప్పుడు ఎటువంటి అనుభూతిని పొందుతారో మా కాలేజీలో డిగ్రీ చదివే విద్యార్థులు కూడా కొత్త క్యాంపస్లో అటువంటి అనుభూతిని పొందనున్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా సాంకేతిక విద్యతో మేళవించిన బీఎస్సీ ఆనర్స్ విత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్ట్ లాంటి కొత్త కోర్సులను ప్రవేశపెడుతూ, బిఎస్‌సి ఆనర్స్ డేటా సైన్స్, బీసీఏ ఆనర్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బిబిఎ హానర్స్ బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బికాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బిఎస్సి ఆనర్స్ బయోటెక్నాలజీ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.



నూతన క్యాంపస్ భవన నమూనా

చల్లరస్తా సెంటర్లో నూతన క్యాంపస్

ప్రిన్సిపాల్ పిల్లలమర్రి జగదీష్ బాబు

విద్యారంగంలో విశేష అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో తరగతుల నిర్వహణ అత్యంత భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా మచిలీపట్నం చల్లరస్తా సెంటర్లో నూతన క్యాంపస్ నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి తీసుకొస్తున్నాం. మచిలీపట్నం పోర్ట్ రోడ్‌లో అడుగుపెడితేనే శ్రీ బాలసాయి డిగ్రీ కళాశాల గుర్తొచ్చేలా మచిలీపట్నం ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించడం వెనుక కళాశాల యాజమాన్యం నిరంతర శ్రమ, ప్రణాళిక బద్ధమైన కషి ఎంతో ఉంది. తల్లిదండ్రులను మోసం చేయడానికో, అడ్మిషన్ల కోసమో, కాలేజీ యాజమాన్యం ప్రచారం చేసుకోవడం కోసమో కాకుండా ఈ కళాశాల స్థాపించిన గత 25 సంవత్సరాలుగా చేయగలిగిందే చెబుతున్నాం, చెప్పిందే చేసి చూపిస్తున్నాం. మా కళాశాల పూర్వ విద్యార్థులు సాధించిన విజయాలు ఉద్యోగాలు చూసి మీ పిల్లల భవిష్యత్తు కోసం బాల సాయి డిగ్రీ కాలేజీల్లో చేర్చాలని నిజాయితీగా తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్నాం.

చెత్తరహిత బందరే లక్ష్యం : మంత్రి



వాహనాలు ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : చెత్త రహిత బందరుని సాకారం చేయడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలోని డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన చెత్త కాంపాక్ట్ వాహనాలను ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బందరు వచ్చినపుడు ఇక్కడి చెత్త, డంపింగ్ యార్డు సమస్యను స్వయంగా చూసి సమస్యని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అందులో భాగంగా రూ.3.75 కోట్లతో తరుణి అసోసియేట్స్ ద్వారా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయడంతో పాటుగా ఇనుము తదితర ఖనిజాలను కూడా వేరు చేస్తారన్నారు. అక్టోబర్ 2 నాటికి ఈ ప్రాంతం మొత్తాన్ని పార్కుగా మార్చాలని ముఖ్యమంత్రి సూచించారన్నారు. వారి ఆదేశాలను పకడ్బందీగా పాటించడంతో పాటుగా, ఆ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. మచిలీపట్నంలో ప్రతి రోజు సుమారు 80-90 టన్నుల చెత్త వస్తోందని దీని కొరకు రూ.3.30 కోట్ల విలువైన మూడు కాంపాక్టర్లు ఏర్పాటు చేశామని, వాటితో చెత్త మొత్తాన్ని తరలించబోతున్నామన్నారు.

పేర్ని నాని మాటలు ప్రజలు నమ్మరు

బియ్యం దొంగిలించి, ఇళ్ల పట్టాల్లో స్కాములకు పాల్పడి ఇప్పుడు దొంగ నాటకాలు ఆడుతున్నారు అని పేర్ని వెంకట్రామయ్యను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తప్పు చేసినట్లు ఒప్పుకుని మళ్లీ తప్పు చేయలేదు అంటున్నారు. తప్పు చేయకుంటే పారిపోవాల్సిన అవసరం ఏమిటి? అధికారుల్ని బెదిరించి బలవంతంగా సంతకాలు చేయించి.. పేరాసి కథలు చెబితే ప్రజలు నమ్మరని తెలుసుకోవాలన్నారు.

20లోపు ఇకెవైసి చేయించుకోవాలి



ప్రజాశక్తి-ఉంగుటూరు : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన సొంత భూమి కలిగిన రైతులు ఈనెల 20వ తారీకు లోపు ఈకేవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి వివిఎస్ ఆర్ఎస్ హరీష్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో హరీష్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన సొంత భూమి కలిగిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. దీనిద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు 20వేల రూపాయలు అందుతుందని అన్నారు. ఈ పరిహారం కుటుంబానికి ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో విఎఏ లు దుర్గా నాగేశ్వరరావు, రసూల్ పాల్గొన్నారు.

సిడిపిఒగా మంగమ్మ బాధ్యతల స్వీకారం



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం సిడిపిఓగా మంగమ్మ గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ లో పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలను చేర్పించడంతోపాటు, వాటి అభ్యున్నతికి చేయాల్సిన కషి పై అంగన్వాడి కార్యకర్తలు, సూపర్వైజర్లతో ఆమె మాట్లాడారు. చిన్నపిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని చెప్పారు.


రావి సీతామహాలక్ష్మి మృతికి సంతాపం



ప్రజాశక్తి-మోపిదేవి : రావు బహుదూర్ వెంకటరంగయ్య మనవరాలు,నాగాయతిప్ప మునసబు కంఠంనేని రామకృష్ణయ్య కుమార్తె రావి సీతామహాలక్ష్మి (87) రావివారిపాలెంలో గురువారం మృతిచెందారు. ఆమె మృతిపట్ల మాజీ సి డి సి చైర్మన్ మోపిదేవి మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు సంతాపం తెలిపారు. మృతురాలు రావి సీతామహాల్క్ష్మీకి ఇరువురు కుమారులు రావి వెంకట సాయిబాబు, జై సూర్యలు ఉన్నారు.

సిసిరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ అభివద్దే శ్వాసగా ముందుకు సాగుతున్నానని, గుడివాడకు స్పెషల్ గ్రాంట్ నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు ప్రజలు తరఫున కతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే రాము అన్నారు. గురువారం స్థానిక 28, 30వ వార్డులోని ధనియాలపేట, వాంబేకాలనీ, ఇందిరానగర్ కాలనీలలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పదికోట్ల స్పెషల్ గ్రాంట్ నిధుల్లో ఆరు కోట్ల నిధులతో చేపట్టనున్న సిసిరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ సిఎం చంద్రబాబు చొరవతో గుడివాడ నియోజకవర్గంలో అనేక అభివద్ధి పనులు జరుగుతున్నా యన్నారు. గుడివాడలో నెలకొన్న దుర్భర పరిస్థితులను 12సార్లు కలిసి వివరించానని తెలిపారు. దీంతో గుడివాడకు పది కోట్ల స్పెషల్ గ్రాంట్ నిధులు మంజూరు చేశారన్నారు. మిగిలిన నాలుగు కోట్ల నిధులతో గుడివాడలోని వివిధ ప్రాంతాల్లో అభివద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ముడా చైర్మన్ మట్టా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు పాల్గొన్నారు.



పాఠశాలల్లో మెరుగైన విద్యను బోధించాలి : ఆర్‌జెడి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యను బోధించాలాని విద్యాశాఖ కాకినాడ సంయుక్త సంచాలకులు జి నాగమణి సూచించారు. జిల్లా పరిషత్ సమావేశా హాలులో జరుగుతున్న ఎస్జీటీల కౌన్సిలింగ్ ప్రక్రియను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యను బోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా కషి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కషి చేయాలన్నారు. ప్రభుత్వ మార్గ దర్శకులకు అనుగుణంగా నూతన విద్యా విధానం ద్వార విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.అలాగే ఉపాధ్యాయుల కోరిక మేరకు ప్రభుత్వం మాన్యువల్ కౌన్సిలింగ్ అనుమతి ంచింది కాబట్టి ఉపాధ్యాయులు తాము కోరుకున్న స్థానాలకు బదిలీ అయ్యి విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. గురువారం మొత్తం ,750 మందిని కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తం గా మొత్తం 2300 మంది బదిలీకి దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 1450 మంది ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు మిగిలిన వారికి శుక్రవారం పూర్తి చేస్తామని జిల్లా విద్యా శాఖాధికారి పి వి జె.రామారావు తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి నాగమణి

40వ వసంతంలోకి కాకతీయ అపోలో

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని కాకతీయ అపోలో విద్యాసంస్థలలో వేసవి సెలవుల అనంతరం తిరిగి నూతన విద్యా సంవత్సరంలోకి అడుగెడుతున్న విద్యార్థినీ విద్యార్థులను 40 వసంతాల సందర్భంగా ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఎంతో



ఘనంగా పూలతో ఆహ్వానం పలికారు. సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులను అలరించారు. ఈ సందర్భంగా చైర్మన్ కాపా రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యా విధానంలో ఎన్నో నూతన వరవడులు వస్తున్నాయని వాటికి అనుగుణంగానే విద్యార్థులు రెడీగా ఉండాలని విద్యతోపాటుగా స్కిల్ డెవలప్మెంట్ అలవర్చుకోవాలని ప్రతిరోజు తప్పకుండా చదవడం రాయటం అలవాటుగా చేసుకోవాలని ఆయన విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాపా భారతి , హెడ్ మాస్టర్ పగడాల వీర రాఘవులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ కేన్సర్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: టాటా మెమోరియల్ సెంటర్‌తో (టీఎంసీ) కలిసి హోమీ బాబా కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో కొత్త భవంతి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఐసీఐసీఐ బ్యాంక్ రీజినల్ ఇంచార్జి కె.ఎస్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 3.9 లక్షల చ.అ. విస్తీర్ణంలో, విశాఖలో అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో ఏర్పాటయ్యే ఈ అధునాతన కేంద్రం నిర్మాణానికి రూ.550 కోట్ల పైగా మొత్తానికి కమిట్‌మెంట్‌తో ఐసీఐసీఐ బ్యాంకు నిధులను సమకూరుస్తోందన్నారు. ఎనిమిది అంతస్తుల ఐసీఐసీఐ ఫౌండేషన్ బ్లాక్ ఫర్ చైల్డ్ అండ్ బ్లడ్ క్యాన్సర్ కొత్త బిల్డింగ్ అందుబాటులోకి వచ్చాక ఏటా మూడు వేల మంది పేషంట్లకు సేవలందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. తూర్పు భారతదేశంలోనే అత్యుత్తమ స్పెషలైజ్డ్ క్యాన్సర్ చికిత్సా కేంద్రాల్లో ఒకటిగా నిల్చేలా రూపొందిస్తున్న ఈ కొత్త భవనంలో 215 పైగా పడకలు ఉంటాయని తెలిపారు. అన్ని అనుమతులకు లోబడి 2027 నాటికి ఇది పూర్తవుతుందని అన్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ సీఎస్ఆర్ విభాగమైన ఐసీఐసీఐ ఫౌండేషన్ ఫర్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ దీన్ని అమలును పర్యవేక్షిస్తుందని తెలిపారు.

పాఠశాల విలీనంపై నిరసన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని ధర్మవరపాడు తండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట



గురువారం ప్రజలు నిరసన తెలిపారు. 6, 7, 8 తరగతులను జయంతిపురం పాఠశాలలో కలపడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పాఠశాలలోనే ఆయా తరగతులు ఉండాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా తరగతులు తమ పాఠశాలలో ఉంచాలని, పాఠశాలలోని తరగతులను ఇతర పాఠశాలకు తరలించవద్దని నినాదాలు చేశారు. తమ పిల్లలు దూరంలో గల ఆ పాఠశాలకు వెళ్లి చదువుకోలేరని కాబట్టి ఈ పాఠశాలలోనే ఆయా తరగతులు ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ఎన్ నారాయణ, ఎం గోపి, బి సక్రు, భూక్య శ్రీను, మాధవి, భవాని, మౌనిక, శైలజ, శారద తదితరులు పాల్గొన్నారు.

విఆర్ స్కూల్స్ ప్రారంభం


ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామంలో జగ్గయ్యపేట రోడ్డులోని ధరణికోట లక్ష్మీనరసమ్మ, గురునాథం మెమోరియల్, వెంకటరమణ స్కూల్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే



శ్రీరాం రాజగోపాల్, మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, మాజీ ప్రభుత్వ విప్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, జేఆర్‌సి విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, శ్రీరామ్ చిన్నబాబు, జగ్గయ్యపేట ఋన్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ప్రారంభించారు. వెంకటరమణ స్కూల్ చైర్మన్, సెక్రెటరీ ధరణికోట వెంకటరమణ వారి తల్లిదండ్రుల దగ్గర నుంచి, వారి కుటుంబం తోటి గల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు.

ప్రజలపై భారాలు ఆపాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపడం ఆపాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ అన్నారు. కొండపల్లి సిపిఎం టౌన్ కమిటీ సమావేశం కొండపల్లిలోని నండూరి ప్రసాద్‌రావు భవన్‌లో సీనియర్ నాయకులు కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. స్మార్ట్ మీటర్లు పగలకొట్టాలని ప్రతిపక్షంలో పిలుపునిచ్చిన లోకేష్ నేడు స్మార్ట్ మీటర్లు బిగించడంపై నోరు మెదకపోవడం విడ్డూరమన్నారు. నిరంతరం పెరుగుతున్న విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ప్రజలపై భారాలు ఆపాలని అన్నారు. పేదలకి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాల హామీని తక్షణమే నెరవేర్చాలన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్లో 8 గంటల పని విధానాన్ని 12 గంటలకి మార్చాలని ప్రతిపాదన తక్షణమే విరమించుకోవాలన్నారు. ఇబ్రహీంపట్నంలో వీటిపిఎస్ బూడిద వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దానిపైన ప్రభుత్వం చర్యలు శూన్యమన్నారు. కొండపల్లి మున్సిపాలిటీలో కృష్ణానది దగ్గరగా ఉన్న మంచినీటి కష్టాలు ప్రజలకు తప్పట్లేదని,



తక్షణమే సురక్షిత మంచినీరు కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కొండపల్లి టౌన్ కమిటీ కార్యదర్శి యం మహేష్, టౌన్ కమిటీ సభ్యులు ఈ కొండలరావు ఎస్ కే బాషా, ఎల్ పార్వతి కె బేబీ సరోజిని పాల్గొన్నారు.

ఎసిఎ సెంట్రల్ జోన్ విజేత కృష్ణా



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఎసిఎ సెంట్రల్ జోన్ అండర్-15 బాలికల అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కష్ణా జట్టు నిలిచింది. ఎసిఎ క్రికెట్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన మ్యాచ్ లో ప్రకాశం - కృష్ణా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో కష్ణా జట్టు 8 వికెట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 18 ఓవర్లు లో ఆరు వికెట్లు కోల్పోయి 49 పరుగులు చేసింది. జట్టు లోని పి.ప్రత్యూష 21 పరుగులు చేయగా, కష్ణా జట్టు బౌలర్లు టి.సౌమ్య రెండు, బి. కార్తిక రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 50 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కష్ణా జట్టు కేవలం 14.5 ఓవర్లు లోనే 50 పరుగులు చేసి విజయం సాధించింది. దీనితో విజయం సాధించిన కష్ణా జట్టుకు నాలుగు పాయింట్లు ప్రకటించారు. అనంతరం వెస్ట్ గోదావరి -గుంటూరు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోయింది. దీనితో నిర్వాహకులు చెరో రెండు పాయింట్లు కేటాయించారు. ఈ టోర్నమెంట్ నందు అత్యధికంగా 12 పాయింట్లు సాధించిన కృష్ణా జట్టును విజేతగా ప్రకటించారు. వెస్ట్ గోదావరి జట్టు రన్నర్ అప్ గా ప్రకటించారు.

ఫ్లోరోసిస్‌ను అరికట్టేందుకు సహకరించాలి

ప్రజాశక్తి-కంచికచర్ల

ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణలో ప్రజలు, వైద్యులు అందరూ కలిసి పనిచేసి ఫ్లోరోసిస్ వ్యాధిని అరికట్టేందుకు సహకరించాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ బద్రీనాథ్ తెలిపారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్లోరోసిస్ కమ్యూనిటీ సర్వే కార్యక్రమం నిర్వహించడం అయినది. ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణ పై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికి సర్వే నిర్వహించారు. స్థానికంగా మినరల్ వాటర్ ప్లాంట్స్ తనిఖీ చేయటం జరిగినది. స్థానిక అంగన్వాడి కేంద్రంను సందర్శించి కేంద్రంలోని పిల్లలకు దంత పరీక్షలు చేయడమైనది. ఈ సందర్భంగా డాక్టర్ బద్రీనాథ్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ అనేది అధిక ఫ్లోరైడ్ తీసుకోవడం వల్ల వచ్చే వ్యాధి అని ఇది ప్రధానంగా కలుషితమైన నీరు లేదా ఆహారం ద్వారా వస్తుందన్నారు. ఫ్లోరోసిస్, దాని నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భూగర్భ జలాలను క్రమం తప్పకుండా పరీక్షించాలని, తద్వారా ఫ్లోరైడ్ స్థాయిని గుర్తించవచ్చన్నారు. ఫ్లోరోసిస్ వ్యాధి సోకిన వ్యక్తిని వెంటనే వైద్యుడికి చూపించి తగిన వైద్య సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల పీహెచ్సీ సూపర్వైజర్ జీవీ రాఘవేంద్రరావు, హెల్త్ హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్, ఏఎన్ఎంలు కుమారి, శ్రీలత, ఆశాలు పాల్గొన్నారు.

అక్కా తమ్ముడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-మైలవరం: అక్కా తమ్ముడు అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మారుతి నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. మైలవరంకు చెందిన వేములమాడ రవిశంకర్, చంద్రికకు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి లక్ష్మీ హిరణ్య (9) లీలా సాయి (7) కుమార్తె కుమారుడు ఉన్నారు. జి.కొండూరులోని క్రిస్టియన్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నారు. భార్యాభర్తల మధ్య కలహాల నేపథ్యంలో రెండు నెల క్రితం తల్లి వీరిని వదిలి పుట్టింటికి వెళ్లి అక్కడ నుండి విదేశాలకు వెళ్లింది. వేసవి సెలవులు కావడంతో తండ్రి వద్ద పిల్లలు ఉంటున్నారు. ఆదివారం రవిశంకర్ ఇంటికి తాళం వేసి ఎటో వెళ్లినట్లు స్థానికులు చెప్తున్నారు. పిల్లల కోసం తాత లక్ష్మీపతి గత నాలుగు రోజుల నుంచి ఇంటికి వస్తున్నాడు. తాళం వేసి ఉండటంతో కుమారుడికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. గురువారం ఇంటికి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. దుర్వాసన రావడంతో ఇంటి వెనుక ఉన్న కిటికీ దగ్గరికి వెళ్లి లోపలికి చూశాడు. పిల్లలు ఇద్దరు విగత జీవులుగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకున్న మైలవరం సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్లు తలుపులు పగలగొట్టి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాల పక్కన పురుగుమందులు డబ్బా ఉండటం, తండ్రి పరారవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్ష్మీపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కూటమి' ఏడాది పాలనపై సంబరాలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం పలుచోట్ల సంబరాలు నిర్వహించారు. పశ్చిమంలోని ఎన్డీఏ కార్యాలయంలో టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ , ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ సీనియర్ నేత కోగంటి రామారావు తదితరులు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, ఉమ్మడి చంటి, మహాదేవు అప్పాజీరావు, అత్తలూరి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యాధరపురంలోని డూండి రాకేష్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఆర్యవైశ్య వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, శాప్ డైరెక్టర్ సంతోష్ పాల్గొన్నారు. భవానిపురం బ్యాంక్ సెంటర్‌లో 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పీవీ చిన సుబ్బయ్య ఆధ్వర్యంలో వేడుకలు



నిర్వహించారు. **మైలవరం:** మైలవరం నియోజకవర్గ సమగ్ర అభివద్ధి ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గురువారం మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పంచాయతీ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. **వీరులపాడు:** జుజ్జూరు గ్రామంలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేస్తూ సంక్షేమ పథకాల అమలులో విప్లతమైన మార్పులు తీసుకున్నామని అన్నారు. ఆర్థికంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు సారథ్యంలో ఈ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాహసోపేతమైన, సుదూరదృష్టితో కూడిన నిర్ణయాలు తీసుకున్నారని, ఫలితంగా కేవలం ఒక్క సంవత్సరంలోనే రాష్ట్రంలో గణనీయమైన మార్పు తీసుకువచ్చి, ప్రజల ఆశలను పునరుజ్జీవింపజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తంబాలపల్లి రమాదేవి, మండల టిడిపి అధ్యక్షులు కొండగట్టు శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కోగంటి బాబు, జిల్లా తెలుగుదేశం



వీరులపాడులో ప్రదర్శనలో పాల్గొన్న ఎంఎల్‌ఎ సౌమ్య

ఉపాధ్యక్షుడు భారతరెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్‌రావు, నాగార్జున ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ కాపా రాంబాబు పాల్గొన్నారు. **తిరువూరు:** స్థానిక ఫ్యాక్టరీ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాలాభిషేకం చేసిన అనంతరం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ కొలికపోగు నిర్మల, కౌన్సిలర్లు నాల్లా సురేంద్ర, జీడిమల్ల సత్యవతి, టిడిపి సీనియర్ నాయకు లు తాళ్లూరి రామారావు, గద్దె వెంకటేశ్వరరావు, మీనుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, నెట్టెం శివరామ్, శ్రీరాం చిన్నబాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
శుక్రవారం 13 జూన్ 2025

ఏడాది పాలనపై కూటమి నాయకుల సంబరాలు


అవనిగడ్డలో...

ప్రజాశక్తి-అవనిగడ్డ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా అవనిగడ్డలో సూపరిపాలన పేరుతో కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. గురువారం గాంధీ క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా తెలుగు మహిళ అధ్యక్షులు తలసిల స్వర్ణలత, జనసేన మత్స్యకార విభాగం రాష్ట్ర కార్యదర్శి లంకె యుగంధర్, జిల్లా కార్యదర్శిలు గాజుల శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టిడిపి నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సుపరిపాలన కార్యక్రమంలో చంద్రబాబు లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి, నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు మోర్ల రాంబాబు, మెండు లక్ష్మణరావు, మండ వ బాలవర్ధిరావు, మాచవరపు ఆదినారాయణ, బం డే కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మండల పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షులు అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు విశ్వనాధుని మురళి మోహన్, చందన నరసింహారావు, బచ్చు రఘునాథ ప్రసాద్ పాల్గొన్నారు

జాస్తి ఆధ్వర్యంలో వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా గన్నవరం మండలం టిడిపి అధ్యక్షులు జాస్తి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజాహిత పాలన కొనసాగించాలని కోరారు. విమాన ప్రమాదంలో మరణించిన వారికి కాసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో కంభంపాటి హేమంత కోటేశ్వరరావు, దేవరపల్లి కోటేశ్వరరావు, జాస్తి శ్రీధర్ బాబు, నల్లమోతు రమేష్, శొంఠి కిషోర్, రాజుల పాటి శ్రీనివాసరావు, మరో 200 మంది పాల్గొన్నారు.

అలాగే బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో తెలుగు యువత ఆధ్వర్యంలో , తెలుగుదేశం కార్యాలయం వద్ద కేక్ కటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామ ప్రముఖులు రాష్ట్రతెలుగు రైతు విభాగ కార్యదర్శి శ్రీ గుండపనేని ఉమా వరప్రసాద్, గ్రామ ఎంపీటీసీ అమతపల్లి సూర్య నారాయణ, మాజీ సర్పంచ్ పిల్ల రామారావు, మచిలీపట్నం పార్లమెంటు తెలుగుయువత కార్యదర్శి మండాది రవీంద్ర పాల్గొన్నారు.


గన్నవరంలో...


గుడివాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : కూటమి ప్రభుత్వ హయంలో గడిచిన ఏడాదికాలంగా అనేక అభివద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం పట్టణంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో నియోజకవర్గ పరిధిలోని కూటమి పార్టీల శ్రేణులు పట్టణంలోని పలు ప్రధాన ప్రాంతాలగుండా ఎన్టీఆర్ స్టేడియం వద్ద చేరుకొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, నేతలతో కలిసి విజయోత్సవ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, జిల్లా బిజెపి అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గూడూరు : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా గూడూరులో పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ సుపరిపాలనకు ఏడాది అనే కార్యక్రమం నిర్వహించి కేక్ కట్ చేసి ఎన్డీఏ కూటమి నాయకులకు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురువారం గూడూరు మండ లం గూడూరు గ్రామంలో రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ చేసి, డ్వాక్రా మహిళలకు మంజూరైన రుణాల పంపిణీ చేసారు.డిసి చైర్మన్ పోతన స్వామి,కూటమి నాయకులు పంచకర్ల సురేష్,దాసరి ఉమా సాయిరాం, కొలపల్లి రజిని, గోపి నాగబాబు పాల్గొన్నారు.

పలుచోట్ల కార్డన్ అండ్ సెర్చ్



ప్రజాశక్తి-విజయవాడ : ఎన్టిఆర్ జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షణ చర్యలలో భాగంగా, సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించే దిశగా ప్రజలకు మేమున్నాము అనే భరోసా ఇచ్చేందుకు నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు రూరల్ డి.సి.పి. కె. ఎం మహేశ్వర రాజు , మైలవరం ఏ.సి.పి వై.ప్రసాద రావు పర్యవేక్షణలో జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ గురువారం నిర్వహించారు. మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ గిరిబాబు , విస్సన్న పేట ఎస్.ఐ రామ కష్ణ వారి సిబ్బంది , ఎక్సైజ్ అదికారులతో కలిసి విస్సన్న పేట గ్రామంలోని చంద్రు పట్ల తండా, కొర్రా తండా, పెద్ద తండా తదితర ఏరియాలలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. తిరువూరు ఎస్.ఐ. వారి సిబ్బంది , ఎక్సైజ్ అదికారులతో కలిసి తిరువూరు మండలం లోని వామ కుంట్ల గ్రామంలో, గంపలగూడెం ఎస్.ఐ., వారి సిబ్బంది , ఎక్సైజ్ అదికారులతో కలిసి గంపలగూడెం అమ్మిరెడ్డి గూడెం గ్రామంలో తెల్లవారుజము 06.00 గంటల నుండి 08.00 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ లో బాగంగా గతంలో నాటు సారా తయారు చేయు ప్రాంతాలో అనుమానితులను పాత నేరస్తులను వివిధ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ నేరాలు, ఘర్షణలు నియంత్రణకు పూర్తిస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

విద్యా కిట్లు పంపిణీ చేయాలి : సిపిఎం


కిట్లు అందిస్తున్న బోయి సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: నగరంలోని వివిధ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకములు ,స్కూలు బ్యాగులు, షూస్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పంపిణి చేయాలని అని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్య బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ నగరపాలక సంస్థ 50డివిజన్ మరుపిల్ల చిట్టి నగర పాలక సంస్థ స్కూలు, కస్తూరి సీతారామయ్య నగరపాలక సంస్థ స్కూలులో విద్యార్థులకు ప్రభుత్వం సప్లై చేసిన పుస్తకాలు ,స్కూలు బ్యాగులు, పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ స్కూలు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన పుస్తకాలు ,బ్యాగులు లభించకపోవడం దారుణమన్నారు. స్కూల్ కిట్స్ అందక విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్నదని ,విద్యా భ్యాసం కొరకు వచ్చిన ప్రతి విద్యార్థికి స్కూల్ పుస్తకాలు ,బ్యాగులు,షూస్ సప్లై చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని కోరారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ


విచారిస్తున్న ఎంఈవో-2 బాలాజీ

ప్రజాశక్తి - గుడివాడ : నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలతో వ్యాపారం చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తక్షణమే పాఠశాల ల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ కష్ణా జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం గుడివాడలోని ఫాదర్ బిఎంకి హై స్కూల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్న పాఠ్యపుస్తకాల అమ్మకా లను అడ్డుకున్నారు. అయితే కళాశాల యాజమాన్యం పోలీసులను పిలిపించి దౌర్జనంయ చేశారని సమరం వాపోయారు. అనంతరం అనంతరం సమరం మాట్లాడుతూ అక్షరాలతో లక్షలు పోగు చేసుకుంటున్న గుడివాడ ఫాదర్ బి.ఎం.కి హై స్కూల్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. స్థానిక ఎంఈఓ బాలాజీకి సమాచారం అందిస్తే ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్కూల్ యాజమాన్యానికి అనుకూలంగా మాట్లాడుతూ తగదన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు శాఖ అధికారులు పాఠ్య పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, తక్షణమే గుర్తింపు రద్దు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ పట్నం ఎస్ఎఫ్ఐ కార్యదర్శి నాగేంద్ర తదితరులుపాల్గొన్నారు.

విద్యా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్స్ వంటి విద్యా కిట్లను స్వయంగా అందించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సభ్యుడిగా కర్లపాటి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కాబడిన సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావును పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా కర్లపాటి మాట్లాడుతూ ఈ కమిటీకి చైర్మన్, వైస్ చైర్మన్లుగా డాక్టర్ జి.సమరం, డాక్టర్ జోషి వ్యవహరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అనీల్ కుమార్, ప్రముఖ అడ్వకేట్ సామినేని రాము, డాక్టర్ మదన్మోహన్, డాక్టర్ నకరికంటి జనార్ధన్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొగ్గవరపు రాజా, చిన సత్యంబాబు తదితర ప్రముఖులు కర్లపాటిని అభినందించారు.

అధికలోడు విద్యుత్ పనులను నిలిపివేయాలి

ప్రజాశక్తి-గంపలగూడెం: పెద్ద కొమెర-తోట మూల విద్యుత్ సబ్స్టేషన్ వెనుక బజారున నూతనంగా 33/11 కేవీ విద్యుత్తు లైన్లో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రహదారికి సంబంధించిన ప్రజలు ఈ విద్యుద్దీకరణ పనులు నిలిపివేయాలని అడ్డుకున్నారు. అధికలోడు విద్యుత్ వైర్లు మా ఇళ్లపై నుండి ఏర్పాటు చేస్తే మా కుటుంబాలకు ప్రమాద కరంగా మారుతుందని వాపోయారు. గ్రామంలో 24 గంటల విద్యుత్ సరఫరా కావాలంటే ఈ లైన్ తప్పనిసరి అని అధికారులు చెబుతుండగా ప్రజలు మాత్రం తిరస్కరిస్తున్నారు.

తిరుమలగిరి ఆలయ ఇఒగా సాంబశివరావు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు నూతన సహాయ కమిషనర్, కార్యనిర్వహ ణాధికారిగా నూతక్కి వెంకట సాంబశివరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రామకృష్ణ ఆచార్యులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ భరద్వాజ సిబ్బంది పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు సంతాపం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : అహ్మదాబాద్ లో చోటు చేసుకున్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందనీ మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జి డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. 242 మందితో లండన్ బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోవడాన్ని ఊహించలేకున్నామనీ మతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వైద్య కళాశాల వసతి భవనాలపై కూలడంతో ఒక మహా విషాదంగా మిగిలిందనీ వ్యాఖ్యానించారు.

ఆగిరిపల్లి రోడ్డు ఎప్పటికి పూర్తవుతుంది...?

- గన్నవరం మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి-గన్నవరం : ఆగిరిపల్లి రోడ్ లో ఆక్రమణలు తొలగించి రెండు నెలలు అవుతుంది.. కనీసం డ్రైనేజీ నిర్మాణ పనులు కూడా చేపట్టలేదు.. రోడ్డు ఎప్పటికీ పూర్తవుతుంది.. ఇందులో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుంది.. ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదు.. నీ ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నారు. నాలుగు సమావేశాలకి ఎంపీపీ అనగాని రవి గైర్ హాజరయ్యారు.. అతన్ని పదవి నుంచి తొలగించండి.. అంటూ ఎంపీటీసీ పడమట పాండు రంగారావు అధికారులపై ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఇన్చార్జి ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన జరిగింది. ఎంపీడీవో స్వర్ణలత, జిల్లా పరిషత్ కో ఆప్షన్ నెంబర్ ఎండి గౌసాని హాజరయ్యారు. పడమట రంగారావు అడిగిన ప్రశ్నలకు ఇంజనీరింగ్ అధికారి దాసు సమాధానం చెబుతూ ఆగిరిపల్లి రోడ్ లో రోడ్డుకి ఇరువైపులా ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు డ్రైనేజీ పనులు చేపట్టాల్సి ఉందని, ఆ తర్వాత రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవో స్వర్ణలత మాట్లాడుతూ ఎంపీపీ రవి సమావేశాలకు రాకపోవడంపై జిల్లా పరిషత్ సీఈఓ కు లెటర్ పెట్టామని, అక్కడ నుంచి ఆదేశాలు వస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు. సూరంపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో సక్రమంగా నీరు రావడంలేదని, డ్రైనేజీ సమస్య ఉందని అధికారులు దష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీపీ సుధీర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

జనావాసాల మధ్య చేపల మార్కెట్ వద్దు

సిపిఎం ధర్నాలో దోనేపూడి కాశీనాథ్



చేపల మార్కెట్ వద్దంటూ ధర్నా చేస్తున్న స్థానిక ప్రజలు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: పాయికాపురం ఎక్సెల్ ప్లాంట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో హోల్‌సేల్ చేపల మార్కెట్ పెట్టొద్దని, బలవంతంగా ఏర్పాటు చేసినా ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ హెచ్చరించారు. జనావాసాల మధ్య చేపలమార్కెట్ వద్దంటూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎక్సెల్ ఫ్యాక్టరీ ఐకాన్ గేట్ గ్రౌండ్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. కాశీనాథ్ మాట్లాడుతూ బీసెంట్ రోడ్డులోని మహంతిమార్కెట్‌లో ఉన్న చేపల మార్కెట్‌ను ఎక్సెల్ ఫ్యాక్టరీ ఎదురు గ్రౌండ్ వద్దకు తరలించాలని కౌన్సిల్ ఎజెండాలో స్థానిక ఎమ్మెల్యే పెట్టిన ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలన్నారు. ఈ ప్రతిపాదనను రాజకీయాలకతీతంగా కార్పొరేటర్లు అందరూ చేపలమార్కెట్‌కు వ్యతిరేకంగా నిర్ణయం చేసి బస్ టెర్మినల్, మినీ బస్టాండ్ నిర్మించే విధంగా నిర్ణయం చేయాలని కోరారు. గత ప్రభుత్వం కాలంలో ఆనాటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆ స్థలంలో బస్టాండ్ టెర్మినల్ నిర్మించాలని కౌన్సిల్లో ప్రతిపాదన చేశారని గుర్తు చేశారు. చేపలమార్కెట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అంతా అపరిశుభ్రత వాతావరణం, దోమలు, ఈగల వలన ప్రజలు పలు రకాల వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే ఎక్సెల్‌ప్లాంట్‌లో పేరుకుపోతున్న చెత్తా చెదారం, ఇతర వ్యర్థాల వలన ఈ ప్రాంత ప్రజలు ఉండలేకపోతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ఎక్సెల్ ప్లాంట్ ఎదురుగా ఉన్న నాలుగున్నర ఎకరాల స్థలంలో బస్టాండ్ టెర్మినల్ నిర్మించడానికి సిపిఎం నాడు మద్దతిచ్చిందని గుర్తు చేశారు. సింగనగర్, పాయికాపురం, కండ్రిక, వాంబే కాలనీ తదితర ఈ ప్రాంత ప్రజలకు చిరకాల కోరిక బస్ టెర్మినల్ నిర్మించాలని ఉందన్నారు. ప్రజలకు అవసరమైన దానిని ఎం.ఎల్.ఏ పట్టించుకోకుండా చేపల మార్కెట్ పెట్టాలనడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ ఎమ్మెల్యే నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఎక్సెల్ ప్లాంట్ ఎదురుగా ఉన్న నాలుగున్నర ఎకరాల్లో బస్టాండ్ టెర్మినల్ నిర్మించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణరావు, నాయకులు కే దుర్గారావు, వై సుబ్బారావు, జి ఝాన్సీరాణి, పి వెంకట్ రెడ్డి, ఎస్కే నిజాం, ఎస్కే పీరు సాహెబ్, కొండలరావు, ఎస్ శ్రీనివాసరావు, బి లక్ష్మణరావు, జి కొండ, పి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ప్రజలపై భారాలు : సిపిఎం

ప్రజాశక్తి-తిరువూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో ప్రజలపై భారాలు మోపడం తప్ప చేసిందేమీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్ విమర్శించారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమల్లో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. 50 సంవత్సరాలు



నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తానన్న పెన్షన్ ఇవలేదన్నారు. యువతకు 20 లక్షల ఉద్యో గాలు, నిరుద్యోగ భృతి కలగానే ఉందని, ప్రతి ఏటా రైతులకు 20 వేలు ఆర్థిక సహాయం అమలు చేయడం లేదన్నారు. ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కోసం ఇస్తానన్న నెలకు రూ.1500 ఇవ్వలేదని, మహిళల ఉచిత ప్రయాణం ఊసే లేదని పేర్కొన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తామన్న గిరిజన డీఎస్సీని నిర్వహించలేదన్నారు. వర్షా కాలం వచ్చే నాటికి పట్టణంలోని అన్ని ఏరియాల్లో కాలువలు తీయించి రోడ్లపై మురికి నీరు ప్రవహించకుండా చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటివరకు ఆ దిశగా ప్రయత్నాలు కూడా ప్రారంభించలేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, ఎస్వీ భద్రం తదితరులు పాల్గొన్నారు

సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలు మండలం అన్నిగండ్లపాడు గ్రామంలో 50 లక్షల రూపాయలతో సిసి రోడ్లు, 14 లక్షల రూపాయలతో నిర్మించిన ఆరు గోకులం



షెడ్లను స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్ల నిర్మాణాల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని అన్నారు. రైతులకు బాసటగా కూటమి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా పని చేస్తుందన్నారు.

తెరుచుకున్న పాఠశాలలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు గురువారం పున:ప్రారంభమయ్యాయి. బాలబాలికలు యూనిఫామ్స్ ధరించి, స్కూల్ బ్యాగ్స్ భుజాన వేసుకొని బడిబాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు స్కూల్ కిట్స్ అందజేయడంతో పాటు సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమ చేయనున్నట్లు ప్రకటించింది. అయితే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ సజావుగా సాగక పోవటం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లేమి సహా అరకొర వసతులతో బడులు తెరుచుకున్నాయి.

చిట్టినగర్ శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : చిట్టినగర్‌లో కొలువై ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత గరుడాచాల స్థిత వెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థాన చతుర్దశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన గురువారం పలు పూజలు నిర్వహించారు. అనంతరం గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ ఎన్ సుధాకర్‌రావు, ఎండోమెంట్ అండ్ రెవెన్యూ జాయింట్ కార్యదర్శి జి రామసుబ్బయ్య, ట్రాఫిక్ వన్ ఏసిపి రామచంద్రరావు, ఆలయ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మరుపిల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్వతనేని కోటేశ్వరరావుకు ఎంపి నివాళి



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఇటీవల మరణించిన నవత ట్రాన్స్‌పోర్ట్ సంస్థ వ్యవస్థాపకుడు ప్రముఖ పారిశ్రామిక వేత్త పర్వతనేని కోటేశ్వరరావు కుటుంబ సభ్యుల్ని ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం పరామర్శించారు. క్రీస్తురాజపురంలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పర్వతనేని కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్ట్ రంగంలో కోటేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. విజయవాడ కేంద్రంగా నవత ట్రాన్స్ ఫోర్ట్ మొదలు పెట్టి దేశ వ్యాప్తంగా రవాణా సేవలను అందించారన్నారు. ఆసియాలోనే అతి పెద్ద ఆటోనగర్ ఏర్పాటు, ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్, ఐలా ఏర్పాటులో పర్వతనేని పోషించిన ప్రముఖ పాత్రను గుర్తు చేశారు. రవాణా రంగంలో ఎంతో మందికి ఉపాధి చూపించిన దార్శనికుడు పర్వతనేని కోటేశ్వరరావు అన్నారు. ఆయన రవాణా రంగానికి అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్, సూరపనేని సురేష్, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, 5వ డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, జనసేన పార్టీ 5వ డివిజన్ అధ్యక్షుడు రామకృష్ణ, టిడిపి నాయకులు యలమంచిలి రాజేష్, రిమ్మనపూడి బ్రమ్మేశ్వరరావు, నర్రా సుబ్బారావు, మాచర్ల ఆనంద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ నగరంలోని మూడు సర్కిల్స్ పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.విజయవాడ పశ్చిమ, సెంట్రల్, తూర్పు నియోజకవర్గాల పరిధిలో గురువారం పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం జరిగింది. సెంట్రల్, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో రూ. 1,184 లక్షలకుపైగా విలువగల మొత్తం 33 అభివద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు.విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో భాను నగర్, మధురానగర్, దేవినగర్, వినాయకనగర్, గుణదల వంటి ప్రాంతాల్లో కొత్త నీటి సరఫరా పైపులు, పేవర్ రోడ్లు, హాట్‌మిక్స్ రోడ్లు, డ్రైనేజీలు, అలాగే ఎంప్లాయిస్ లేఅవుట్ ప్రాంతాల్లో రబ్బిష్ రోడ్లు నిర్మాణాలు . సుమారు రూ. 836 లక్షల విలువైన ఈ పనులు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచే దిశగా అనేక మార్గాల్లో ప్రయోజనాలు కలిగించనున్నాయి. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బొండా మహేశ్వరావు పాల్గొన్నారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని సుమారు 73 లక్షల 52వ డివిజన్ ప్రాంతంలో పాత పైపుల మార్పులు, కొత్త హెచ్‌డిపిఇ, జిఐ వాటర్ పైపులైన్లు, 43వ డివిజన్‌లో హెచ్‌బి కాలనీలో కళ్యాణ మండపం సమీపంలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టబడ్డాయి. ఈ పనులకు మూడున్నర కోట్ల రూపాయల ఖర్చు మంజూరు అయ్యాయి.తూర్పు నియోజకవర్గంలో గద్దె రామ్మోహన్ గారు శంకుస్థాపనలు జరిపిన పనుల్లో కష్ణలంక, శ్రీనివాస నగర్, భరతీనగర్ వంటి ప్రాంతాల్లో కొత్త సీసీ రోడ్ల నిర్మాణం, పార్కు ప్రాంతాల అభివద్ధి, బిల్డింగ్ నిర్మాణం మొదలైనవి ఉన్నాయి. ఈ పనుల కోసం మొత్తం రూ. 248 లక్షల వ్యయం అంచనా వేశారు.



సుధాకరరావు వర్ధంతి

ప్రజాశక్తి-తిరువూరు: ఏపీఎస్ ఆర్టీసీ తిరువూరు డిపోలో కండక్టర్‌గా, కార్యాలయంలో ఉద్యోగిగా పని చేస్తూ కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడిన ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు బత్తుల సుధాకరరావు పదో వర్ధంతిని సిఐటియు ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద గురువారం నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ పతాకాన్నీ ప్రముఖ ప్రజా వైద్యులు వల్లభనేని రవీంద్ర ఆవిష్కరించారు. అనంతరం సుధాకరరావు చిత్రపటానికి ఆయన సతీమణి హైమావతి పూలమాలవేసి నివాళులర్పించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల సరైన అవగాహన కలిగి ఉండి వాటి పరిష్కారానికి నిరంతరం పరితపించిన కార్మిక నేత సుధాకరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, సిఐటియు నాయకులు ఎస్వీ.భద్రం, బి.వెంకటేశ్వరరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు కెవి.రావు, పూర్ణశంకరరావు, సంజీవరావు, వి. విష్ణు, ప్రజా సంఘాల నాయకులు వెంకటరత్నం నూకల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విఎంసి కౌన్సిల్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. గురువారం జరిగిన అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా ఫ్లైట్ ప్రమాదం కారణంగా శుక్రవారం జరగాల్సిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు విఎంసి సెక్రటరీ కె వసంతలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి జరగబోయే సమావేశపు తేదీని త్వరలో తెలియచేస్తామని సెక్రటరీ వివరించారు. కార్పొరేటర్లు, అధికారులు కౌన్సిల్ వాయిదా విషయాన్ని గమనించి సహకరించాలని వారు కోరారు.